క్లుప్తంగా

ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించండి



బాధితుల సమస్యలు వింటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజా వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కరించేలా చూడాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. ఆర్థిక అంశాలతో ముడిపడిన వాటిని పాలకుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. గ్రీవెన్స్‌లో మున్సిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బకాసుర బలి



బలి బండిని తీసుకెళ్తున్న కళాకారులు

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో సోమవారం బకాసురబలి బండి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ద్రౌపదీ సమేత పాండవుల ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం బకాసురుడికి ఆహారం తీసుకెళ్లడానికి భీముడు గ్రామాల్లో తిరిగి ఆహారం తీసుకుని బండితో భీముడు వేషధారి పలు గ్రామాల్లో తిరిగి ఆహారం సేకరించారు. భక్తులు పూజలు చేసి పలు ఆహార పదార్థాలను అందించారు. రెండు బండ్లలో కళాకారులు భీముడి వేషధారణలో పర్యటించారు. వచ్చే నెల ఒకటో తేదీన బుధవారం ఆలయంలో దాతల సహకారంతో ద్రౌపదీదేవి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త గుడిసె మునస్వామి శెట్టి, కార్యనిర్వాహకులు తెలిపారు.

147 మందికి వైద్య పరీక్షలు



రోగులకు బీపీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరంలో 147 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరంలో భాగంగా ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య సిబ్బంది రక్తపోటు, మధుమేహంతో పాటు పలు రోగాలు వ్యాధులకు, మహిళలకు ప్రత్యేక పరీక్షలు చేయించారు. వైద్యం చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు, మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు, సీహెచ్ఓ, పీహెచ్ఎన్, సర్పంచ్ రవిచంద్రారెడ్డి, ఆరోగ్యపర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

నీడిల్స్ వాడకంపై శిక్షణ



మాట్లాడుతున్న చిత్తూరు అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ జయంతి

తవణంపల్లె: నర్సింగ్ కళాశాల విద్యార్థులకు ఇంజెక్షన్ వేసేందుకు వినియోగించే నీడిల్స్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శిక్షణా తరగతులు నిర్వహించారు. సోమవారం అరగొండ అపోలో నర్సింగ్ కళాశాలలో ఇంజెక్షన్ వేసినప్పుడు పుండ్లు కాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దీనిపై చిత్తూరు అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ టి.జయంతి నర్సింగ్ విద్యార్థులకు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లోకేశ్వరి, ప్రొఫెసర్లు డాక్టర్ సిరి, డాక్టర్ కిషోర్, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

కనికరం చూపండయ్యా..!

పింఛన్ ఇప్పించండి సామీ..



పింఛన్ ఇప్పించాలని కోరుతున్న శారద

తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించడయ్యా అంటూ చిత్తూరు నగరం సంతపేటకు చెందిన శారద కోరారు. ఆమె మాట్లాడుతూ తన వయస్సు 85 సంవత్సరాలని చెప్పారు. అయినా తనకు వృద్ధాప్య పింఛన్ ఇవ్వడం లేదని తెలిపారు. ఎన్నిసార్లు అధికారుల వద్దకు తిరిగినా న్యాయం జరగడం లేదని వాపోయారు.

పింఛన్ ఇప్పించండి సారూ..



కృష్ణమ్మ

కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్న తనకు పింఛన్ ఇప్పించండి సారూ అంటూ చిత్తూరు నగరంలోని రాములగుడి వీధికి చెందిన కృష్ణమ్మ వాపోయారు. ఆమె మాట్లాడుతూ తనకు, తన భర్తకు ఆరోగ్యం సరిగ్గా లేదన్నారు. వృద్ధులమైన తమకు ఎలాంటి జీవనాధారం లేదని తెలిపారు. ప్రతి నెలా కిడ్నీ డయాలసిస్ మందులకు కనీసం రూ.7 వేలు ఖర్చు అవుతోందన్నారు. ఇందు కోసం అప్పులు చేస్తున్నామని, దయ ఉంచి పింఛన్ ఇప్పించాలని వేడుకున్నారు.

- కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు
- పింఛన్ కోసం కొందరు అభాగ్యులు.. కన్నకొడుకు కొడుతున్నాడని వృద్ధ దంపతులు
- ప్రతి వారం కలెక్టరేట్‌కు బాధితుల తాకిడి
- పరిష్కారం అవుతున్నవి ఎన్నో ?



వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : వారాల తరబడి వేడుకుంటున్నాం.. న్యాయం చేయండయ్యా అంటూ పలువురు అర్జీదారులు ఉన్నతాధికారులను వేడుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జేసీ విద్యాధరి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌లో సమస్యల పరిష్కారానికి మొరపెట్టుకున్న కొందరి అర్జీదారుల ఆవేదన ఇలా..

కన్న కొడుకే ఏడిపిస్తున్నాడయ్యా..



కన్న కొడుకే దాడి చేస్తున్నాడని కన్నీరు పెట్టుకుంటున్న రంగమ్మ, భక్తవత్సలం

కన్నకొడుకే భూమి కోసం చిత్రహింసలు చేస్తున్నాడయ్యా అంటూ చిత్తూరు నగర పరిధిలోని అనుపల్లికి చెందిన వృద్ధ దంపతులు రంగమ్మ, భక్తవత్సలం కన్నీరుమున్నీరయ్యారు. న్యాయం చేయాలంటూ కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తమ చిన్నకుమారుడు నారాయణ రెవెన్యూ అధికారుల సహాయంతో తమ 3 ఎకరాల భూమిని లాక్కునేందుకు చిత్రహింసలు పెడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డపారతో దాడి చేశాడని చెప్పారు. ఉన్న 13 ఎకరాలను కుమారులకు పంచి పెట్టామన్నారు. తమ జీవనాధార భూమిని ప్రస్తుతం కాజేసేందుకు దౌర్జన్యం చేస్తున్నాడని రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

ఇంటి స్థలం ఆక్రమించుకున్నారు



స్థలం ఆక్రమించుకున్నారని విన్నవిస్తున్న పద్మావతి

తన ఇంటి స్థలాన్ని గిరి అనే వ్యక్తి ఆక్రమించుకుని, ఇబ్బంది పెడుతున్నాడని బంగారుపాళ్యం మండలం కేజీ సత్రం గ్రామానికి చెందిన బాధితురాలు పద్మావతి వాపోయారు. ఆమె మాట్లాడుతూ తమ గ్రామంలో సర్వే నంబర్ 317లో 3 సెంట్ల భూమిని చదును చేసి గుడిసెలు నిర్మించుకుని తాము జీవనం కొనసాగించేవారమన్నారు. ప్రస్తుతం తమ గ్రామానికి చెందిన గిరి అనే వ్యక్తి ఇంటి స్థలాన్ని ఆక్రమించుకున్నారన్నారు. తమ స్థలాన్ని తిరిగి ఇప్పించాలని ఆమె అధికారులకు విన్నవించారు.

మనిషి తత్వాన్ని బోధించిన మహాకవి 'సినారె'



జాతీయ పురస్కారాలు అందుకున్న రచయితలతో సాహితీవేత్త మల్రిపూడి దేవేంద్రరావు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తెలుగు జాతికి మనిషి తత్వాన్ని బోధించి మహాకవిగా సినారె అరుదైన కీర్తిని పొందారని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు సి.నారాయణ స్వామి, ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంవీ శ్రీధర్ రెడ్డి తెలిపారు. చిత్తూరు నగరం కొంగారెడ్డి పల్లెలో బ్రెయిన్ బాక్స్ అకాడమీలో ప్రముఖ సాహితీవేత్త మల్రిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో «సినారె సాహితీ వైభవం» పేరిట గీతాలాపన, కవితార్చన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి వైభవానికి అద్దం పట్టేలా సాహిత్యాన్ని మలిచి కోట్లాదిమందిని ఆకట్టుకున్నారని అన్నారు. రచయితలు నందిపాటి చక్రపాణి, కొఠారి వెంకటరత్నం, జి.శాంతకుమారి మాట్లాడుతూ 18 ప్రక్రియల్లో సినారె 90 వరకు గ్రంథాలు రాశారని, సినీ సాహితీ ప్రస్థానం 3,500 పైగా గీతాలతో సుసంపన్నమైనదని అన్నారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పోస్ట్ డాక్టోరల్ కె.సి.లావణ్య, మైసూరు విశ్వవిద్యాలయం కేంద్ర భారతీయ భాషల సంస్థ తెలుగుశాఖ పోస్ట్ డాక్టోరల్ జి.సుభాషిణి మాట్లాడుతూ ఉద్యోగ ధర్మాన్ని నిర్వహిస్తూ, కావ్యరచన చేస్తూ దేశంలో అత్యున్నతమైన 'జ్ఞానపీఠ్' పురస్కారాన్ని అందుకోవడం ఎవరికీ సాధ్యమన్నారు. కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పోస్ట్ డాక్టోరల్ బి.చక్రవర్తి, ప్రముఖ రచయిత తోటగోవిందన్ సంయుక్తంగా మాట్లాడుతూ సినారె దేశచరిత్రలో అరుదైన సాహితీ శిఖరంగా నిలిచారన్నారు. 30 మంది రచయితలకు 'సినారె జాతీయ పురస్కారాలు-2025'ను ప్రముఖ సాహితీవేత్త మల్రిపూడి దేవేంద్రరావు ప్రదానం చేశారు. రచయితలు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు



మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్

యాదమరి: ప్రజలచే ఎన్నుకోబడిన తాము వారి ఆకాంక్షల మేరకు మండల అభివృద్ధికి అహర్నిశలూ కష్టపడ్డామని ఎంపీపీ సురేష్‌బాబు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా స్థానికంగా ఉన్న సర్పంచ్‌లు, ఎంపీటీసీల పూర్తి అధికారం ఉంటుందన్నారు. ప్రభుత్వాలు మారినంత మాత్రాన వారికి ఇవ్వాల్సిన సముచిత గౌరవం, ప్రాధాన్యత ఈ ప్రభుత్వంలో దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు తమపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించారని.. కానీ పలు అభివృద్ధి పనులకు కొందరు అధికారులు కూటమి నేతల ఒత్తిళ్ల వల్ల సహకరించడం లేదని వాపోయారు. ఉన్న కొద్దిరోజులైనా మండలంలోని కొన్ని గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయాలని కోరారు. అధికారం శాశ్వతం కాదని స్థానిక ప్రజాప్రతినిధులుగా ప్రజల అవసరం మేరకు మనం చేసిన అభివృద్ధి మాత్రమే చరిత్రలో నిలుస్తుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు కేవలం ప్రజాసేవకు పరితపించారని అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడలేదని తేల్చిచెప్పారు. అనంతరం పలువురు సభ్యులు తమ పంచాయతీలలోని సమస్యలను అధికారులకు విన్నవించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, విద్యుత్, బస్సురవాణా, ఉపాధిహామీ పనులు తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీఓ పెంచల వీరేంద్ర, డిప్యూటీ ఎంపీడీఓ రామచంద్ర, ఏఓ దీప, ఏపీఓ సంధ్యారాణి, వివిధశాఖల అధికారులు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జీఎస్టీ అవగాహన కార్యక్రమాలపై అలసత్వం వద్దు



జీఎస్టీ అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలపై అలసత్వం ఉండకూడదని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 19వ తేదీ వరకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఇంటికి వెళ్లి జీఎస్టీ లాభాలపై అవగాహన కల్పించాలన్నారు

ప్రతి పీహెచ్‌సీలో ఎన్‌సీడీ సెల్..

జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఎన్‌సీడీ సెల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల్లో అమలవుతున్న స్టార్‌ఎన్‌సీడీ విధానంపై చర్చించేందుకు ఢిల్లీ నుంచి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ బృందం విచ్చేసిందన్నారు. ఈ బృంద సభ్యులకు విధానం అమలు తీరుపై వివరించినట్లు తెలిపారు. ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎన్‌సీడీ క్లినిక్స్ అన్ని ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయడం ముఖ్యమన్నారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, బృంద సభ్యులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



పాలేరులో క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్, నాయకులు

- కూటమి అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొందాం
- పాలేరులో క్యూఆర్ కోడ్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉండడానికే పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ఆవిష్కరించారని మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పాలేరు గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నాయకులతో కలసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అరాచక పాలనకు చెక్ పెట్టేందుకు డిజిటల్ బుక్‌ను తీసుకువస్తున్నారని, పార్టీ శ్రేణులపై జరిగే దాడుల్లో భాగంగా పోలీస్ అధికారులు, కూటమి నేతలపై మొబైల్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వాటికి పరిష్కారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిస్తారన్నారు. అన్యాయానికి గురైన కార్యకర్తలు «డిజిటల్ బక్»లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. «డీబీడబ్ల్యూడబ్ల్యూవైఎస్ఆర్‌సీపీకామ్» అనే వెబ్‌సైట్‌లో గానీ, 040-49171718 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యకర్తలను కాపాడుకోవడానికి పార్టీ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. డిజిటల్ బుక్‌పై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి కూటమి నేతల అరాచకాలను ఎండగట్టాలన్నారు. మండలంలో పంచాయతీ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, రాష్ట్రమైనారిటీ విభాగం కార్యదర్శి సర్దార్, రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శి కిషోర్ కుమార్‌రెడ్డి, జిల్లా ట్రేడ్ యూనియన్ కార్యదర్శి రఘుపతిరాజు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, మండల అధ్యక్షుడు అరుణామల్‌రెడ్డి, ఎస్సీ, మైనారిటీ సెల్ అధ్యక్షుడు నాగరాజ, షాకీర్, మండల యూత్ అధ్యక్షుడు గజేంద్ర, కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్, మాజీ సర్పంచ్ విజయకుమార్, సోషల్ మీడియా అధ్యక్షుడు శైలేష్, నాయకులు మహేంద్ర, కుమార్ స్వామి, ఖాదర్‌బాషా, ముబారక్, కుట్టి, నాగభూషణం, శివారెడ్డి, బాలాజీ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెట్రోలు బంకు నిర్వహణకు సిద్ధం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, ఇండియన్ ఆయిల్ సంయుక్తంగా కలిసి నగరంలో పెట్రోలు బంకు నిర్వహించడానికి సమాయత్తమైంది. కొంగారెడ్డిపల్లెలోని రైతు బజార్ వద్ద సోమవారం ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి భూమిపూజ చేశారు. త్వరలోనే పనులు పూర్తి చేసి, పెట్రోలు బంకును అందుబాటులోకి తీసుకొస్తామని నేతలు పేర్కొన్నారు.

27 మందికి సీఎం సహాయ నిధి చెక్కులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గంలో 27 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సోమవారం చెక్కులు అందచేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 27 మందికి రూ.31.07 లక్షల చెక్కులను పంపిణీ చేశారు.

అధ్యాపక.. ఇది భావ్యమేనా !





పీసీఆర్‌లో రాజకీయ బ్యానర్‌లో ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్ చిత్రం, ఫ్రెషర్స్ డే బ్యానర్లలో విద్యార్థుల అర్ధనగ్న చిత్రాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : విద్యార్థులకు విలువలతో పాటు మంచి మార్గంలో నడిపించాల్సిన ప్రిన్సిపల్, లెక్చరర్లే దారి తప్పారు. గుడిలాంటి విద్యాలయాన్ని రాజకీయాలకు కేంద్రబిందువుగా మార్చేశారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 28న ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. అందులో భాగంగా చిత్తూరు ఎమ్మెల్యే, ఆయన తండ్రి ఫొటోలతో అక్కడ చదివే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కూడిన భారీస్థాయి బ్యానర్లను ఏర్పాటు చేశారు. అదే విధంగా మరికొన్ని బ్యానర్లలో అక్కడ చదివే విద్యార్థులు అర్ధనగ్నంగా ఉన్న ఫొటోలను ముద్రించి ఏర్పాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. బాలికలు వాటిని చూసి తలదించుకున్నారు. ఎంతో చరిత్ర కలిగిన పీసీఆర్ ప్రభుత్వ కళాశాలను రాజకీయాలకు వేదిక చేయడం ద్వారా కళాశాల పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తోంది. ఒకవైపు ప్లాస్టిక్ బ్యానర్ల నిర్మూలనకు, స్వచ్ఛ భారత్ పేరుతో కలెక్టర్ పలు కార్యక్రమాలు నిర్వహిస్తుంటే.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛభారత్‌కు విఘాతం కలిగించే బ్యానర్ సంస్కృతికి శ్రీకారం చుట్టడం గమనార్హం. గతంలో కళాశాలలో ఎన్నడూ ఇలాంటివి జరగలేదని కాలేజీ అధ్యాపకులే చెబుతున్నారు. ఈ బ్యానర్లలో కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్ చిత్రం కూడా ఉండడం కొసమెరుపు. భవిష్యత్‌లో ఇలాంటివి చేయకుండా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

దివ్యాంగ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : దివ్యాంగ నిరుద్యోగులకు ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకురాలు భవ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగ నిరుద్యోగులకు ఉచితంగా కంప్యూటర్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. విద్యార్హత కలిగి 19 నుంచి 34 ఏళ్లలోపు వయసు ఉండి తమ పని తాము చేసుకునే వారై ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న దివ్యాంగ నిరుద్యోగులు విద్యార్హత పత్రాలతో పా టు 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్, సదరం సర్టిఫికెట్‌తో అక్టోబర్ 1వ తేదీన తిరుపతి జిల్లా కేంద్రంలోని భవానీనగర్‌లో ఉన్న యూత్‌ఫర్ జాబ్స్ ఫౌండేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరాలకు 9347411952, 9392923884 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

సొసైటీ అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ చిత్రానాయుడు

యాదమరి: సహకార సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని సింగిల్‌విండో అధ్యక్షురాలు చిత్రానాయుడు కోరారు. సోమవారం ఆమె స్థానిక సహకార సంఘం కార్యాలయ ఆవరణలో జరిగిన మహాజన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదాతలకు అవసరమైన మేరకు విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. అయితే రైతులు రుణాల చెల్లింపులో వెనుకబడుతున్నారని, తద్వారా సంఘం లక్ష్యం నీరుగారుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి తాకట్టు రుణాలను రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకు అందిస్తామన్నారు. పంట రుణాల కింద రూ.5 లక్షల వరకు మంజూరు చేస్తామని, ఈ అవకాశాన్ని రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రూ.8 లక్షల విలువైన చెక్కులను పలువురు రైతులకు అందించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు



పరిసరాలను శుభ్రం చేయిస్తున్న అధికారులు

ఐరాల: స్వచ్ఛతా..! ఏదీ నీ చిరునామా..? శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా డిప్యూటీ ఎంపీడీఓ జేఎల్ ఆర్‌వీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మాధవి సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద చెత్తకుప్పను పరిశీలించారు. అక్కడి చెత్తకుప్పను గ్రామ పంచాయతీ సిబ్బంది సహాయంతో తొలగించారు. అదేవిధంగా వీఎస్ అగ్రహారంలో వ్యర్థాలతో దర్శనమిస్తున్న మురుగు కాలువను శుభ్రం చేయించారు. పిచ్చి మొక్కలను తొలగించారు.



వీఎస్ అగ్రహారంలో మురుగు కాలువలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE(SENIOR DIVISION) OF CHITTOOR
E.P.NO.1 OF 2025
DRB-1/CFS/70/2017-2018
on the file of Deputy Registrar of Chits, First Zone, Margosa road, Malleshwaram, at Bangalore.

Between:
M/s Manappuram Chits(K) Pvt.Ltd. rep.by its Foreman/ Branch Manager,Bangalore-11. ... Decree Holder

And :
Mr.M. Jayarama Naidu and others. ... Judgment Debtors.

ORDER 21 RULE 22
NOTICE TO J.DRS. 1 AND 3.

To
J.Dr.1. Mr.M. Jayarama Naidu, S/o M. Anjaneyalu Naidu,
J.Dr.3.Mrs. Usha Rani, W/o M. Jayarama Naidu,
Both are r/a No.4-1977/2B,A-Block, S.S. Cross,Durganagar Colony, Lalu Gardens,Chittoor. A.P.517001.
Sir/Madam,

Take notice that the above E.P.No.1 of 2025 filed by the D.Hr. against the J.Drs 1 and 3(both of you) for sale of the E.P. schedule mentioned property. is stands posted to 13.10.2025 for your appearanceand to show cause why the property not be sold. If you do not appear on 13.10.2025 at 10.30 a.m. before the Hon'ble Court either in person or through an Advocate the matter will be decided in your absence. (by order of this Hon'ble court).

Sd/- C. DAMODARAIAH,
Counsel for Decree Holder.
Place:Chittoor, Dt.27-09-2025

దేవీ.. దీవించమ్మా..!

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. సోమవారం సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవార్లు భక్తులను కటాక్షించారు. పలు ఆలయాల్లో దుర్గాదేవిగా, రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

-బంగారుపాళెం/ఐరాల/చిత్తూరురూరల్/గుడిపాల/బంగారుపాళెం









బంగారుపాళెం: దుర్గాదేవిగా ముత్యాలమ్మ , వజ్రాలపురంలో సరస్వతీదేవిగా గంగమ్మ , గుడిపాల: రాజరాజేశ్వరిగా వళ్లిదేవసేన సమేత, సరస్వతీదేవిగా చాముండేశ్వరిదేవి



గుడిపాల : సరస్వతీ దేవి అలంకరణలో భక్తులను కటాక్షిస్తున్న ద్రౌపదీదేవి అమ్మవారు